మనం
మెదక్ సంగారెడ్డి సిద్దిపేట
మంగళవారం | 28 | నవంబర్ | 2023 | పేజీలు : 7



## దుబ్బాక ఆత్మగౌరవ రక్షణకు రాజీలేని పోరాటం

-ఎమ్మెల్యేగా గెలిపిస్తే అభివృద్ధే ఎజెండాగా పనిచేస్తా
-ఆరు గ్యారంటీల అమలు కాంగ్రెస్ పార్టీ బాధ్యత
-కాంగ్రెస్ దుబ్బాక అసెంబ్లీ అభ్యర్థి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి
-సోమేశ్వరాలయంలో ప్రమాణం



4 లో



# సంగారెడ్డి జిల్లా నాది... ఇది నేను పుట్టిన జిల్లా

సంగారెడ్డి, నవంబర్ 27, మనం న్యూస్ః గత ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థిని ఓడగొట్టినా సంగారెడ్డి మీద అలగలేదు... ఎందుకంటే సంగారెడ్డి నాది కదా... ఇది నేను పుట్టిన జిల్లా కదా... అని ముఖ్యమంత్రి కేసీఆర్ పేర్కొన్నారు. సంగారెడ్డి నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన బిఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్ పాల్గొని ప్రసంగించారు. సంగారెడ్డిలో నేను తిరగని గల్లీ లేదు.. నాల్‌సాబ్ గడ్డ నుండి మొదలుకొంటే ప్రతి గల్లీలో నేను పాదయాత్ర చేశారు. ప్రజల అవసరాలు తీర్చడానికి ఇక్కడ మొత్తం పాదయాత్ర చేశాను... మీ మధ్యలోనే తిరిగేది... అలా అనేక కార్యక్రమాలు చేశాను అని కేసీఆర్ మిగతా 2లో..

- పెన్షన్‌ను రూ. 5 వేలకు పెంచుతాము
- ఇందిరమ్మ రాజ్యం అంటే ఎన్‌కౌంటర్లు, ఆకలి చావులు
- సంగారెడ్డికి మెట్రో వస్తే భవిష్యత్తే మారిపోతుంది
- 24 గంటల పాటు ఉచితంగా నీటిని అందిస్తాము
- రాయేదో... రత్నమేదో చూసి ఓటేయాలి
- ముఖ్యమంత్రి కేసీఆర్



## మీరే మా బలం.... మా బలగం

- హరీష్‌రావు ధ్యాసంతా మీపైనే
- మీ ఆప్యాయతలెప్పటికీ మరువం
- రికార్డు మెజార్టీని అందించండి: హరీష్‌రావు సతీమణి శ్రీనిత



సిద్దిపేట, నవంబర్ 27, మనం న్యూస్ ప్రతినిధిః మనమంతా ఒకే కుటుంబమని, మీరే మా బలం, మీ మా బలగం... అంటూ మంత్రి హరీష్‌రావు సతీమణి శ్రీనిత పేర్కొన్నారు. సిద్దిపేట ప్రజల గురించి, ప్రేమ గురించి హరీష్‌రావు ఎప్పుడూ గొప్పగా చెబుతుంటే విన్నానని, నేడు ప్రత్యక్షంగా చూసి ఆనందపడుతున్నా నన్నారు. మంత్రి హరీష్‌రావుకు సిద్దిపేట ఒక కుటుంబమని, ఎవరికి ఆపద వచ్చినా, ఎవరికి కష్టమొచ్చినా అండగా ఉంటూ సిద్దిపేట కోసం ఇంకా ఏం చేయాలని నిరంతరం ఆలోచిస్తుంటాడన్నారు. ఆయన ఎక్కడ వెళ్లినా, ఏది కొత్తగా కనిపించినా సిద్దిపేటలో ఉండాలని కోరుకునే నాయకుడు అతడన్నారు. మీ ఆదరణ, ఆప్యాయత ఎప్పటికీ మరువం... గుండెల్లో పెట్టుకుం టామన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవా రం నాడు నారాయణరావుపేట మండలంలోని గుర్రాల గొంది, జక్కాపూర్ గ్రామాల్లో ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరిస్తూ మిగతా 2లో..

## తెలంగాణ కేసీఆర్ జాగీర్ కాదు

- ప్రభాకర్‌రెడ్డి గెలిస్తేనే దుబ్బాక అభివృద్ధి అనడం సిగ్గుచేటు
- పదేండ్లు ఎంపిగా ఉండి చేయనోడు ఎమ్మెల్యేగా ఏం చేస్తాడు?
- ఎన్ని డ్రామాలాడినా దుబ్బాకలో గెలిచేది బీజేపియే
- దళిత ముఖ్యమంత్రి నుండి రైతురుణమాఫీ దాకా అన్నింటా మోసమే
- దుబ్బాక బీజేపి అభ్యర్థి మాధవనేని రఘునందన్‌రావు



దుబ్బాక/దుబ్బాక టౌన్, నవంబర్ 27, మనం న్యూస్ః కొట్లాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో ఎంతో మంది అమరవీరుల త్యాగఫలం, ప్రాణత్యాగాలు దాగి ఉన్నాయని, తెలంగాణ కేవలం కేసీఆర్ జాగీరు కాదనే విషయం గుర్తుంచుకోవాలని దుబ్బాక బీజేపి అభ్యర్థి మాధవనేని రఘునందన్‌రావు స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రం కోసం కేసీఆర్ కుటుంబం మాత్రమే కొట్లాడి రాష్ట్రాన్ని మిగతా 2లో..

## సంగారెడ్డి జిల్లా నాది...

# ఇది నేను పుట్టిన జిల్లా

మొదటి పేజీ తరువాయి..

గుర్తు చేశారు. ఎన్నికల తర్వాత పెన్షన్‌ను రూ. 5 వేలకు పెంచుతామన్నారు. సంగారెడ్డి ప్రజా ఆశీర్వాద సభలో మాట్లాడిన సీఎం కేసీఆర్ ఎన్నికలు రాగానే ఆగమాగం కావొద్దన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థితోపాటు ఆయన వెనకున్న పార్టీని చూసి ఓటేయాలన్నారు. రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయించే ఓటును వివేకంతో వేయాలని పిలుపునిచ్చారు. రాయేదో, రత్నమేదో చూసి ఓటేయాలన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజల దగ్గర ఉన్న ఒకే ఒక ఆయుధం ఓటు అన్నారు. బీఆర్ఎస్ పార్టీ పుట్టిందే తెలంగాణ ప్రజల కోసం అన్నారు. 15 సంవత్సరాలు తెలంగాణ కోసం పోరాడి సాధించుకున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ 50 సంవత్సరాల పాలనలో ప్రజలు చాలా బాధపడ్డారన్నారు. కాంగ్రెస్ పాలనలో రూ.200 పెన్షన్ ఉంటే ఇప్పుడు రూ.2 వేల పెన్షన్ అందిస్తున్నామన్నారు. రాష్ట్ర సంపద పెరిగిన కొద్దీ పెన్షన్ పెంచుకుంటూ పోయామన్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే 24 గంటల పాటు ఉచితంగా నీటిని అందిస్తామన్నారు. సంగారెడ్డిలో ఉన్న ప్రస్తుత ఎమ్మెల్యే నాడు కాంగ్రెస్‌కు అమ్ముడుపోయాడన్నారు. ధరణిని తీసేసి బంగాళాఖాతంలో వేస్తామని కాంగ్రెస్ నేతలు అంటున్నారని, వారినే బంగాళాఖాతంలో కలపాలన్నారు. ఇందిరమ్మ రాజ్యమే సక్కగా ఉంటే ఎన్‌టీఆర్ పార్టీ ఎందుకు పెట్టాల్సి వచ్చిందో ఆలోచించాలన్నారు. ఇందిరమ్మ రాజ్యం అంటే ఎన్‌కౌంటర్లు, ఆకలి చావులు అన్నారు. సంగారెడ్డికి మెట్రో వస్తే భవిష్యత్తే మారిపోతుందన్నారు. సంగారెడ్డికి మరిన్ని కాలేజీలు తీసుకువస్తామన్నారు. కావున ప్రజలంతా ఈసారి బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలని ఆయన కోరారు.

### ఎన్నికల కమీషన్ నిబంధనల మేరకు

## పోలింగ్ చేపట్టాలి

### -రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్




సిద్దిపేట రూరల్, నవంబర్ 27, మనం న్యూస్ః ఎన్నికల కమీషన్ మార్గదర్శకాల ప్రకారం పోలింగ్ నిర్వహణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎలక్ట్రోరల్ అధికారి వికాస్‌రాజ్ అన్నారు. రాష్ట్రంలో శాసనసభ స్థానాలకు జరగబోయే సాధారణ ఎన్నికల ఏర్పాట్లపై జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల పోలింగ్ నిర్వహణ, ఓటింగ్ గుర్తింపు కార్డుల పంపిణీ తదితర అంశాలపై పలు సూచనలు చేశారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో మహిళలు, యువత, దివ్యాంగులను పోలింగ్‌లో భాగస్వామ్యం చేసేలా మోడల్ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల ప్రచార సమయం అసెంబ్లీ నియోజకవర్గంలో నవంబర్ 28న సాయంత్రం 4 గంటలకు ముగుస్తుందని, అనంతరం 48 గంటల పాటు సైలెన్స్ పీరియడ్ పాటించాల్సి ఉంటుందన్నారు.




# మీరే మా బలం.... మా బలగం

మొదటి పేజీ తరువాయి..

అండగా ఉండాలంటూ కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఎన్నికకు మీరంతా హరీష్‌రావుకు అండగా ఉంటూ అంతకంతకూ మెజార్టీని పెంచుతూ అభిమానాన్ని చాటుకుంటున్నారని, మరోసారి యావత్ దేశం సిద్దిపేట వైపు చూసేలా లక్షా యాభై వేల మెజార్టీని అందించాలని కోరారు. ఎంతో ఆత్మీయత ఉన్న ప్రజలు సిద్దిపేట నియోజకవర్గ ప్రజలని, మీ అందరికీ సేవ చేసే అదృష్టం దొరకడం ఆనందంగా ఉందన్నారు. ప్రతి రోజు 18 గంటలు ప్రజల కోసమే పని చేస్తూ నియోజకవర్గంలోని ఏ ప్రాంతంలో అయినా పండుగ, ఆపతి, సంపతి ప్రతి కార్యక్రమంలో పాల్గొంటూ నిత్యం అందుబాటులో ఉంటారన్నారు. ఎన్నికలు వచ్చేసరికి రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశానుసారం ఇతర నియోజకవర్గ బాధ్యతలపై వెళ్లినప్పటికీ సిద్దిపేటలో ప్రచారానికి దూరంగా ఉన్నప్పటికీ మీరంతా ఎంతో గొప్పగా హరీష్‌రావు వెంటే ఉంటామంటూ చెప్పడం సంతోషంగా ఉందన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం ఉద్యమ నాయకుడు కేసీఆర్ ముఖ్యమంత్రి కావడంతో సిద్దిపేటలో ఒకప్పటి నినాదాలన్నీ నేడు నిజమై కళ్ల ముందు కనిపిస్తున్నాయన్నారు. ఈనెల 30వ తేదీన జరిగే ఎన్నికల్లో హరీష్‌రావును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

**-అభిమానం.. ఉత్సాహం**

ఎన్నికల ప్రచారానికి మంత్రి హరీష్‌రావు సతీమణి శ్రీనిత రావడంతో యువకులు, మహిళల్లో ఉత్సాహం కనిపించింది. మేమంతా హరీష్‌రావు వెంటే ఉంటామంటూ అభిమానాన్ని చాటుకుంటూ పూలవర్షం కురిపించారు. మంగళహారతులతో ఘన స్వాగతం పలికి అనుక్షణం అండగా ఉండే హరీష్‌రావుకే మా మద్దతంటూ నినదించారు.







# తెలంగాణ కేసీఆర్ జాగీర్ కాదు

మొదటి పేజీ తరువాయి..

సాధించినట్లుగా ప్రజలను విస్మరించి కుటుంబ పాలన సాగిస్తూ రాష్ట్ర సంపదను దోచుకోవడం సిగ్గుచేటన్నారు. సోమవారం రోజున దుబ్బాకలోని ఆయన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ పుట్టింది చింతమడక అయినా బిక్ష పెట్టింది దుబ్బాక అన్న విషయాన్ని మరువద్దని, చింతమడకలో ఇంటింటికి రూ.10 లక్షలు ఇచ్చినట్లు దుబ్బాకలో ఎందుకు ఇవ్వలేదని ఆయన ప్రశ్నించారు. తాను చదువుకున్న పాఠశాలను ప్రారంభించే మొహంలేని కేసీఆర్ ఎంపిగా పదేళ్లు ఉండి దుబ్బాకకు ఏమీ చేయలేని వ్యక్తిని ఎమ్మెల్యేగా నిలబెడితే నేడు దుబ్బాక నియోజకవర్గ ప్రజలకు ఏం చేయగలడని ప్రశ్నించారు. పైపెచ్చు ప్రజలంతా కొత్త ప్రభాకర్‌రెడ్డిని గెలిపిస్తే తప్పతకుండా దుబ్బాకను రెవెన్యూడివిజన్ చేస్తామని, అభివృద్ధి చేస్తామని ప్రకటించడం సిగ్గుచేటన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి గెలవకపోతే అభివృద్ధిని ఆపివేయడం ప్రజాస్వామ్య దేశంలో ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. సీఎం కేసీఆర్, తన కొడుకు, అల్లుడుతోపాటు దుబ్బాక నియోజకవర్గంలో ఎవరు వచ్చినా, ఎంత మంది ప్రచారం చేసినా దుబ్బాక గడ్డపై ఈసారి ఎగిరేది బీజేపి జెండాయే అని, ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ఓ వైపు దుబ్బాక ఒక కన్ను, సిద్దిపేట మరో కన్ను అని చెప్పే హరీష్‌రావు దుబ్బాకపై సవతి తల్లి ప్రేమ చూపిస్తూ ఎక కడికి వెళ్తే ఆ ప్రాంతం తనకు రెండవ కన్నుగా చెప్పుకోవడం హాస్యాస్పదం కాదా అన్నారు. అదేవిధంగా దుబ్బాక ప్రజలతో పాటు తెలంగాణ రాష్ట్ర ప్రజలకు కేసీఆర్ 2014లో ఇచ్చిన దళిత ముఖ్యమంత్రి హామీ నుండి నేటి నిరుద్యోగ భృతి, రైతు రుణమాఫీ దాకా అన్నింటా ప్రజలకు మోసం చేస్తూనే వస్తుందని, ఏ ఒక్క హామీని బీఆర్ఎస్ పార్టీ అమలు చేసి ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించలేదన్నారు. అంతేకాకుండా కేంద్రంలోని బీజేపి ప్రభుత్వం ద్వారా వచ్చే సంక్షేమ పథకాల నిధులను తమ నిధులుగా చెప్పుకుంటూ ప్రజల్లో పోజులు కొడుతున్నారని, నేడు కేసీఆర్‌కు ప్రధాని మోదీ వద్దకు నేరుగా వెళ్లి మాట్లాడే మొహం ఉందా అని ప్రశ్నించారు. ప్రతి గ్రామం, పట్టణాలతోపాటు నగరాల అభివృద్ధికి కేంద్రం నిధులు విడుదల చేస్తూనే ఉందని, దీనిపై చర్చకు తాను సిద్ధమని, అవసరమైతే చర్చకు వచ్చేందుకు హరీష్‌రావుకు దమ్ముందా అని ప్రశ్నించారు. నాటి తెలంగాణ ఉద్యమంలో ఉన్నది రఘునందన్‌రావు అయితే తిన్నది మాత్రం కేసీఆర్, హరీష్‌రావులని మండిపడ్డారు. పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ పాలనలో దుబ్బాకలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని, దుబ్బాక నియోజకవర్గ ప్రజలు ఎంతో జాగరూకులని, వారికి నేడు కావాల్సింది మోసపూరిత హామీలు కాదని, వారి సంక్షేమాన్ని నిరంతరం కాంక్షించే, ప్రజల పక్షాన ప్రశ్నించే గొంతుక అన్నారు. ప్రజల ముందు ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చినంత మాత్రన ఓట్లు పడవని, ప్రజల మనస్సుల్లో నిజమైన నాయకుడిగా అభివృద్ధి ప్రదాతగా నిలిచిన వారికే ఓట్లు వేస్తారని, అది బీజేపి అభ్యర్థిగా తనకే దక్కుతుందన్నారు. దుబ్బాక ప్రజలను బీఆర్ఎస్ నాయకులు తక్కువ అంచనా వేస్తున్నారని, ఇప్పటికే ఉప ఎన్నికల్లో కర్రుకాల్చి వాత పెట్టారని, ఈసారి దుబ్బాక ప్రజలు మరోసారి ఇచ్చే షాక్‌కు కేసీఆర్ కుటుంబం మొత్తం కోలుకోలేకుండాపోతుందన్నారు.

## ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూడాలి

### -పోలింగ్ అధికారులకు ఎన్నికల పరిశీలకుల సూచన




సిద్దిపేట, నవంబర్ 27, మనం న్యూస్ ప్రతినిధిః ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూడాలని ఎన్నికల సాధారణ పరిశీలకులు, పోలీస్ పరిశీలకులు, వ్యయ పరిశీలకులు ఎన్నికల నిఘా బృందాలు, అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా ఎన్నికల అధికారి ప్రశాంత్ జీవన్ పాటిల్ అధ్యక్షతన పోలింగ్ చివరి 72 గంటల్లో తీసుకోవాల్సిన చర్యలపై ఎన్నికల నిఘా బృందాలతో సమావేశం నిర్వహించారు. నాలుగు రాష్ట్రాల ఎన్నికలు పూర్తయినందున దేశ మీడియా మొత్తం తెలంగాణ రాష్ట్రంపై ఉందని, ఈ ఎన్నికల్లో మద్యం, మనీ, మజిల్ పవర్ ప్రభావం చూపకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించి ఆదర్శంగా నిలిచేలా అధికారులు పని చేయాలన్నారు. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే ప్రచారానికి అనుమతి ఉన్నందున 5 గంటల తర్వాత ప్రచారం నిర్వహించే వాహనాలను గుర్తించి సీజ్ చేసి కేసునమోదు చేయాలన్నారు. అధిక ప్రభావం గల ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో, పట్టణ ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా పెట్టాలని తెలిపారు.



# లిక్కర్ కేసులో ఎవరినీ వదలం



-పార్టీ, మతంతో సంబంధం లేకుండా సంక్షేమ ఫలాలు

-దోచుకుంటున్న కేసీఆర్ కుటుంబం

-కేంద్ర మంత్రి అనురాగ్‌సింగ్ ఠాకూర్



సిద్దిపేట, నవంబర్ 27, మనం న్యూస్ ప్రతినిధిః ఢిల్లీ లిక్కర్ కేసులో సంబంధం ఉన్న ఏ ఒక్కరినీ వదిలిపెట్టబోమని, లిక్కర్ కేసు ఇంకా పూర్తి కాలేదని, లిక్కర్ కేసుతో సంబంధం ఉన్న కవితతో సహా అందరూ శిక్ష అనుభవించాల్సిందేనని కేంద్ర మంత్రి అనురాగ్‌సింగ్ ఠాకూర్ అన్నారు. ఎన్నో ఆశలతో తెలంగాణ రాష్ట్రాన్ని సకల జనులు సాధించుకుంటే నేడు కేసీఆర్ కుటుంబం ఒక్కటే ఫలాలు అనుభవిస్తుందన్నారు. కేసీఆర్ కుటుంబంలోని సభ్యులంతా ఎవరికి వారు అందినకాడికి దోచుకుంటున్నారని, ఇక ఈ దోపిడీ పాలన అంతం మరెంతో దూరంలో లేదన్నారు. అవినీతి ఊబిలో కూరుకుపోయిన తెలంగాణ రాష్ట్రంలో సర్కారు ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ వాగ్దానాన్ని అమలు చేయలేదన్నారు. ఇండ్ల కోసం కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులను డబుల్ బెడ్‌రూమ్‌ల పేరుతో నిర్మించి ఇదంతా తమ గొప్పే అంటూ చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. ఉద్యోగాల మాట ఊసే లేదని, నోటిఫికేషన్‌లు వేసినా లీకులతో నిరుద్యోగుల బతుకులు ఆగమయ్యాయన్నారు. కాళేశ్వరం కమీషన్‌ల కోసం మాత్రమే కట్టారని, మేడిగడ్డ పరిస్థితిని బట్టి చూస్తే అర్థమవుతుందని, నాడు రజాకార్ల పాలన నుండి సర్దార్ వల్లభాయ్ పటేల్ ఎలా అయితే హైదరాబాద్‌కు విముక్తి కలిగించారో అదే స్ఫూర్తిని మరోసారి చూపుతూ నయా రజాకార్లను సాగనంపాలన్నారు. సామాజిక న్యాయం బీజేపితోనే సాధ్యమని, తెలంగాణ రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా బిసి ముఖ్యమంత్రి కాబోతున్నాడన్నారు. సమ్మక్క సారలమ్మ పేరుతో ట్రైబల్ యూనివర్సిటీని తీసుకుస్తున్నామని, విమోచన దినమైన సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహిస్తామన్నారు. పార్టీ, మతంతో సంబంధం లేకుండా చిట్టచివరి వ్యక్తి వరకు సంక్షేమ ఫలాలు అందాలన్నదే తమ లక్ష్యమన్నారు. వ్యవసాయం చేసే రైతుల బాధలను దృష్టిలో ఉంచుకొని క్వింటాల్ వరి ధాన్యానికి మద్దతు ధర రూ.3100 చెల్లిస్తామన్నారు. సిద్దిపేట బీజేపి అభ్యర్థి దూది శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ 38 ఏండ్ల నుండి కేసీఆర్ కుటుంబ కబంధ హస్తాల నుండి సిద్దిపేటను విముక్తి చేయడమే లక్ష్యంగా పోరాటం



సాటిస్తున్నామన్నారు. అభివృది.. అభివృద్ధి.. అంటూ చెప్పడం తప్పితే ఏ ఒక్క కంపెనీ రాలేదు,.... ఉద్యోగం ఇవ్వలేదు. లేకలేక ఐఎంఎల్ డిపో వస్తే కూలీ నౌకరీ కోసం రూ.15 లక్షలకో నౌకరీని ఇతర జిల్లాల వారికి అమ్ముకున్నారని ఆరోపించారు. పోలీస్ రాజ్యంతో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న సర్కారు కనీసం ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని, అలాంటప్పుడు ఒక్క ఓటు కూడా ఎందుకు వేయాలన్నారు. విద్యుత్, నల్లా బిల్లులు అడ్డగోలుగా పెంచి సామాన్యుల నడ్డి విరవడమే కాకుండా సిద్దిపేట పట్టణంలో ఎవరైనా ఇల్లు కట్టుకుంటే చాలు కౌన్సిలర్లు రాబంధుల్లా తయారై దోచుకుంటున్నారన్నారు. సిద్దిపేటలో జరుగుతున్న అభివృద్ధి అంతా కేంద్రం ఇస్తున్న డబ్బులతోనే అని, కాదంటే చర్చకు సిద్ధమా అన్నారు. కార్యకర్తలు, అనుయాయులకే దళితబందు, బిసిబంధునిస్తూ అర్హులను మోసం చేస్తున్న సర్కార్‌కు ఘోరీ కట్టే సమయం ఆసన్నమైందన్నారు. అంతకుముందు రూరల్ పోలీస్ స్టేషన్ సర్కిల్ నుండి భారీ ద్విచక్ర ర్యాలీని నిర్వహించారు. ముస్తాబాద్ చౌరస్తా, విక్టరీ చౌరస్తా, శివాజీ చౌక్, సుభాష్‌రోడ్‌ల మీదుగా పాత బస్టాండ్ చేరుకుంది. ఈ కార్యక్రమంలో నాయకులు వంగ రాంచంద్రారెడ్డి, చొప్పదండి విద్యాసాగర్, లింగంపల్లి శ్రీనివాస్, బాసంగారి వెంకట్, పత్రి శ్రీనివాస్, తొడుపునూరి వెంకటేశం, దాబా నరేష్, కోడూరి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# దుబ్బాక నియోజకవర్గ అభివృద్ధి బిఆర్ఎస్‌తోనే సాధ్యం

-కాంగ్రెస్, బీజేపిలకు ఓటేస్తే కష్టాలు, భారం తప్పదు

-బిఆర్ఎస్‌తోనే ప్రజా సంక్షేమం

-మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్



మిరుదొడ్డి, నవంబర్ 27, మనం న్యూస్ః దుబ్బాక నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధిపరుచుకోవాలంటే కారు గుర్తుకు ఓటేసి బిఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్, ఎంపి ప్రభాకర్‌రెడ్డి తనయుడు పృథ్వీకృష్ణారెడ్డి కోరారు. సోమవారం మిరుదొడ్డి మండల పరిధిలోని అల్వాల, కొండాపూర్, అందె, మల్లుపల్లి, లింగుపల్లి, చెప్యాల గ్రామాలలో ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. మహిళలు మంగళహారతులతో గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉప ఎన్నికల్లో మోసపోయి ఇప్పటికీ గోసపడుతున్నామని గుర్తు చేశారు. దుబ్బాక నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎంపి కొత్త ప్రభాకర్‌రెడ్డి చేసిన అభివృద్ధి తప్పితే బీజేపి నాయకులు చేసిందేమీ లేదని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ పాలనలో చేస్తున్న అభివృద్ధి పనులను బీజేపి నాయకులు తామే చేస్తున్నామని దుబ్బాక నియోజకవర్గంలో చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్, బీజేపిల మాటలు ప్రజలు నమ్మి మోసపోవద్దన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే కరెంటు కష్టాలు తప్పవని, బీజేపి పార్టీకి ఓటేస్తే పేద ప్రజలపై నిత్యావసరాల భారం మోపుతుందని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం దుబ్బాక నియోజకవర్గ రైతులకు ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టి కూడవెల్లి వాగు జీవనదిలా ప్రవహించేలా కృషి చేయడం జరిగిందన్నారు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్, రైతుబంధు, రైతుబీమా, వికలాంగులకు, వితంతువులకు, చేనేత కార్మికులకు పెన్షన్‌లు, కళ్యాణలక్ష్మి వంటి సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ఘనత కేసీఆర్‌దే అన్నారు. నవంబర్ 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో బిఆర్ఎస్ అభ్యర్థి ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ ఛైర్మన్ భాస్కరాచారి, ఎంపిపి గజ్జల సాయిలు, జెడ్పిటిసి లక్ష్మిలింగం, వైస్ ఎంపిపి పోలీస్ రాజులు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు కిష్టయ్య, పెద్ది కవిత రాజు, శంకర్, భారతి భూపతి గౌడ్, బాల్‌నర్సింలు, ఎంపిటిసిలు లలిత సత్యంతోపాటు మండల పార్టీ అధ్యక్షులు తోట అంజిరెడ్డి, మజీ ఏఎంసి ఛైర్మన్ సత్యనారాయణ, తెరాస నాయకులు తోట కమలాకర్‌రెడ్డి, గుండం రాజమహేందర్‌రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు హైమద్, నర్సింహారెడ్డి, ప్రసాద్, సుధీర్, పర్శరాములు, బాబు తదితరులు పాల్గొన్నారు.





## దొమ్మాటను మండల కేంద్రంగా ప్రకటించాలి

### సీఎం కేసీఆర్‌ను కోరిన సర్పంచ్ పూజిత వెంకట్‌రెడ్డి

దౌల్తాబాద్, నవంబర్ 27, మనం న్యూస్ః దొమ్మాటన గ్రామాన్ని చుట్టుపక్కల పలు గ్రామాలను కలిపి మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని సీఎం కేసీఆర్‌కు సర్పంచ్ పూజిత వెంకట్ రెడ్డి కోరారు. ఈ మేరకు ఆదివారం దుబ్బాకలో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో దొమ్మాట గ్రామ సర్పంచ్ పూజిత వెంకట్‌రెడ్డి సీఎం కేసీఆర్‌ను కలిసి దొమ్మాట గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని, గతంలో దొమ్మాట నియోజకవర్గ కేంద్రంగానూ ఉండేదని, నాటి నుండి ఇప్పటి వరకు ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో పలు కొత్త మండలాలను ఏర్పాటు చేసిన సందర్భంగా దొమ్మాటను కూడా మండల కేంద్రంగా ఏర్పాటు చేసి ప్రభుత్వ సేవలు ప్రజలకు చేరువలో ఉండేలా చూడాలని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకువెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు.

## కేసీర్‌కు మద్ధతు తెలిపిన కొండపాక ముదిరాజ్ సంఘం



కొండపాక, నవంబర్ 27, మనం న్యూస్ః కేసీఆర్‌కు మద్ధతుగా కొండపాక ముదిరాజ్ సంఘం సంపూర్ణ మద్ధతు తెలుపుతూ తీర్మానం చేశారు. సోమవారం కొండపాక పెద్దమ్మ దేవాలయం వద్ద నిర్వహించిన సమావేశంలో సభ్యులంతా ఏకగ్రీవ తీర్మానం చేసి కేసీఆర్‌కు ఓటు వేస్తామని ప్రకటించి డిసిసబి ఛైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, తెలంగాణ భారత జాగృతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంతుల ప్రశాంత్, గ్రామ సర్పంచ్ చిట్టి మాధురిలకు తీర్మాన పత్రం అందించారు.

# దుబ్బాక ఆత్మగౌరవ రక్షణకు రాజీలేని పోరాటం






**-ఎమ్మెల్యేగా గెలిపిస్తే అభివృద్ధే ఎజెండాగా పనిచేస్తా**

**-ఆరు గ్యారంటీల అమలు కాంగ్రెస్ పార్టీ బాధ్యత**

**-కాంగ్రెస్ దుబ్బాక అసెంబ్లీ అభ్యర్థి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి**

**-సోమేశ్వరాలయంలో ప్రమాణం**

దుబ్బాక/దుబ్బాక టౌన్, నవంబర్ 27, మనం న్యూస్‌ః తెలంగాణ ఏర్పడక ముందు ఆంధ్రా పాలకుల వద్ద, తెలంగాణ ఏర్పడిన తర్వాత బిఆర్ఎస్ నాయకులచే అణిచవేయబడుతున్న దుబ్బాక నియోజకవర్గ ప్రజల ఆత్మగౌరవ రక్షణకు తాను నిరంతరం పాటుపడుతానని దుబ్బాక అసెంబ్లీ కాంగ్రెస్ అభ్యర్థి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని చెల్లాపూర్‌లో గల సోమేశ్వరాలయంలో ఆయన బాండ్ పేపర్‌పై పలు వాగ్ధానాలు రాసి ప్రమాణం చేశారు. అనంతరం చెల్లాపూర్, రాజక్కపేట, మల్లాయిపల్లి, వడ్డెర కాలనీ, బలవంతాపూర్, పద్మశాలిగడ్డ, నర్లన్‌గడ్డ, అప్పనపల్లి, దుంపలపల్లి, ఆకారం, ధర్మాజీపేట గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీల అమలు పక్కాగా అమలుచేసి తీరుతామన్నారు. దుబ్బాక నియోజకవర్గ ప్రజలు తనపై నమ్మకంతో తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజకవర్గ అభివృద్ధే ఎజెండా పని చేస్తానన్నారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. దుబ్బాక నియోజకవర్గ ప్రజల ఆత్మగౌరవాన్ని కాపాడుతానని, నియోజకవర్గానికి రావాల్సిన నిధులను ప్రభుత్వంతో కొట్లాడి అయినా తీసుకువచ్చి నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడుతానన్నారు. అవినీతికి ఏమాత్రం తావు లేకుండా పారదర్శకంగా పని చేస్తూ దుబ్బాక ప్రగతి కోసం



మాత్రమే పాటుపడుతానని ప్రతిజ్ఞ చేస్తున్నానన్నారు. ఇప్పటికే బిఆర్ఎస్ పాలనలో దుబ్బాక 50 ఏండ్లు అభివృద్ధిలో వెనక్కి నెట్టివేయబడిందని, మరోసారి అభివృద్ధి కావాలంటే తిరిగి ప్రజలు హస్తం గుర్తుకు ఓటేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన ఓటర్లను కోరారు. గతంలో ముత్యంరెడ్డి హయాంలో చేసిన అభివృద్ధి తప్ప కొత్తగా ఎక్కడా ఎలాంటి అభివృద్ధి లేదన్నారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌తోనే నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమని, కావున ప్రజలంతా ఈనెల 30న జరిగే ఎన్నికల్లో తమ ఓటును హస్తం గుర్తుపై వేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కొంగరి రవి, మున్సిపాలిటీ ప్రధాన కార్యదర్శి మంద శ్రీనివాస్, సీనియర్ నాయకులు అనంతుల శ్రీనివాస్, ఆకుల భరత్, చెరుకు అమరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శాసనసభ ఎన్నికల నిర్వహణకు

# యంత్రాంగం సిద్ధం

**జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శరత్**




సంగారెడ్డి, నవంబర్ 27, మనం న్యూస్‌ః జిల్లాలో శాసనసభ ఎన్నికల నిర్వహణకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ శరత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మొత్తం 910 లొకేషన్‌లలో 1609 పోలింగ్ కేంద్రాలున్నాయని తెలిపారు. నవంబర్ 28వ తేదీన సాయంత్రం 5 గంటల నుండి ప్రచార కార్యక్రమాలు నిషేధించడం జరుగుతుందని, ఎన్నికలు ముగిసే వరకు జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. 28వ తేదీ సాయంత్రం 5 గంటల నుండి పోలీస అధికారులు అప్రమత్తంగా ఉండాలని, జిల్లాయేతర వ్యక్తులు ఎవరూ జిల్లాలో ఉండకూడదని స్పష్టం చేశారు. ఎఫ్ఎస్‌టి, ఎస్ఎస్‌టి, ఎంసిసి అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అదేవిధంగా నవంబర్ 28వ తేదీ సాయంత్రం 5 గంటల నుండి ఎన్నికలు ముగిసే వరకు జిల్లాలో మద్యం దుకాణాలు మూసివేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు రూ.5.24 కోట్ల నగదు జప్తు చేశామని, ఆదాయపన్ను శాఖ ద్వారా రూ.19.48 కోట్లు నగదు జప్తు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా 2,67,863.55 లీటర్ల లిక్కర్, 659.58 కిలోల అక్రమ గంజాయిని జప్తు చేశామని, 7.155 గ్రాముల బంగారం, 23.641 గ్రాముల వెండి, 1395 చీరలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. జిల్లాలో సీ విజిల్‌యాప్ ద్వారా 302 ఫిర్యాదులు రాగా అన్ని ఫిర్యాదులపై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకున్నామన్నారు. ప్రవర్తన నియమావళి ఉల్లంఘనల కింద 25 ఫిర్యాదులు రాగా 20 కేసులు నమోదు చేసినట్లు, 9 సోషల్ మీడియా ఫిర్యాదులు రాగా ఐదు కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. జప్తు చేసిన నగదు నుండి జిల్లా గ్రీవెన్స కమిటీ ద్వారా రూ.3.40 కోట్లు విడుదల చేశామని, జిల్లాలో ఇప్పటి వరకు 6086 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని కలెక్టర్ పేర్కొన్నారు.

# వైభవంగా అష్టాదశ శక్తిపీఠ సహిత ఉమా రామలింగేశ్వర స్వామి ప్రతిష్ఠ

కొండపాక, నవంబర్ 27, మనం న్యూస్‌ః కొండపాక ఆనంద నిలయం ఆవరణలో దేశంలోనే ఎక్కడా లేని విధంగా నిర్మించిన అష్టాదశ శక్తిపీఠ సహిత ఉమా రామలింగేశ్వర స్వామి ప్రతిష్ఠ మహోత్సవం సోమవారం అత్యంత వైభవంగా జరిగింది. సోమవారం ఉదయం గురువందనము, ప్రాతఃకాల పూజలు, గర్తసంస్కారము, బీజన్యాసము, రత్నవ్యాసము, దాతున్యాసము నిర్వహించారు. ఉదయం 5:11 గంటలకు తులా లగ్న పుష్కరాంశ సుముహూర్తమున శ్రీ పుష్పగిరి పీఠాధీశులు జగద్గురువులు విద్యాశంకర భారతీ స్వామి కరకమలములచే యంత్ర ప్రతిష్ట, మూర్తి ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠ, శిఖర ప్రతిష్ఠ, కళా





న్యాసములు, షోడశ తత్వన్యాసములు, దృకలి, గోప్రథమ దరశనం, పూర్ణాహుతి, కుంభాభిషేకము జరిగాయి. అష్టాదశ శక్తిపీఠ ప్రతిష్ఠలతోపాటు రామలింగేశ్వర స్వామి పార్వతీదేవి , గణపతి, సుబ్రహ్మణ్య స్వామి, విగ్రహం మూర్తులను వేదమంత్రోచ్చరణల మధ్య ప్రతిష్ఠించారు. అనంతరం ధ్వజస్తంభ ప్రతిష్ట చేశారు. ఈ సందర్భంగా పుష్పగిరి పీఠాధీశులు జగద్గురువులు విద్యాశంకర భారతీస్వామి భక్తులను ఉద్దేశించి అనుగ్రహభాషణం చేశారు. ప్రశాంత వాతావరణంలో నిర్మించిన అష్టాదశ శక్తిపీఠ సహిత రామలింగేశ్వర స్వామి దేవాలయం ప్రపంచంలోనే ప్రసిద్ధి చెందుతుందని తెలిపారు. ట్రస్టు ఛైర్మన్ కె.వి. రమణాచారి ఆనంద నిలయం ట్రసుట ఛైర్మన్ లత రమణాచారి పర్యవేక్షించారు. దేవాలయాన్ని సిద్దిపేట పోలీస్ కమీషనర్ శ్వేత, కొండపాక సర్పంచ్ చిట్టి మాధురితోపాటు వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు అమ్మవార్లను దర్శించుకొని పూజలు చేశారు.

# నిశ్శబ్ధ విప్లవం

**-బిఎస్‌పి విజయం ఖాయం**

**-అన్ని వర్గాలకు అండగా ఉంటా**

**-బిఎస్‌పి అభ్యర్థి చక్రధర్ గౌడ్**

సిద్దిపేట, నవంబర్ 27, మనం న్యూస్ ప్రతినిధిః నిశ్శబ్ధ విప్లవం రాబోతుందని, ఈ ఎన్నికల్లో గెలిచేది, గెలిపించేది బహుజనులేనని బిఎస్‌పి అభ్యర్థి చక్రధర్‌గౌడ్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారంనాడు సిద్దిపేటలోని పలు వార్డుల్లో నిర్వహించిన కార్నర్ మీటింగ్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇన్నాళ్లు ఏ లక్ష్యం కోసమైతే బడుగు



బలహీన వర్గాలు పోరాటం చేస్తున్నాయో, అధికారం కోసం వేచి చూస్తున్నారో ఆ సందర్భం రానే వచ్చిందన్నారు. బిఆర్ఎస్ నాయకుల అరాచకాలు, అవినీతికి ఇక చరమగీతం పాడబోతున్నామన్నారు. ఒక్కడిగా ఉన్నప్పుడే సొంత డబ్బులతో ఎన్నో కార్యక్రమాలు చేశా.. మీరందరూ ఆశీర్వదించి అసెంబ్లీకి పంపిస్తే ఇంకెంత చేస్తానో ఒక్కసారి ఆలోచించండి అన్నారు. ఇప్పటికే అన్ని గ్రామాలు అంతా ఒక్కటయ్యాయన్న సంకేతాలు వస్తున్నాయని, బిఎస్‌పి గెలుపు ఆపలేరన్నారు.

# కుటుంబ పాలనకు చరమగీతం పాడాల్సిందే



**-అధికారంలోకి వచ్చిన నాటి నుండి ప్రజలకు అన్యాయమే**
**-రేషన్ కార్డులివ్వకుండా క్వాటర్ దుకాణాలు పెంచిన ఏకైక ప్రభుత్వం బిఆర్ఎస్**
**-దుబ్బాక నుండే బిఆర్ఎస్‌ను భూస్థాపితం చేస్తాం**
**-ఎంతమంది వచ్చినా దుబ్బాకలో గెలిచేది బీజేపియే**
**-దుబ్బాక బీజేపి అభ్యర్థి మాధవనేని రఘునందన్‌రావు**



మిరుదొడ్డి, నవంబర్ 27, మనం న్యూస్ః తెలంగాణ రాష్ట్రంలో కుటుంబ పాలనకు చరమగీతం పాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని దుబ్బాక బీజేపి అభ్యర్థి మాధవనేని రఘునందన్‌రావు అన్నారు. సోమవారం మిరుదొడ్డి మండల కేంద్రంలో బీజేపి కార్యకర్తలతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. మహిళలు మంగళహారతులతో డప్పు చప్పుళ్ల మధ్య ఆయనకు ఘన స్వాగతం పలికారు. బీజేపి మిరుదొడ్డి పార్టీ శాఖ ఆధ్వర్యంలో ఆయనను గజమాలతో సత్కరించి నాగలితోపాటు గొర్రెపిల్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్దిపేట, గజ్వేల్ తరహాలో దుబ్బాకను గత పదేళ్ల కాలంలో హరీష్‌రావు ఎందుకు అభివృద్ధి చేయలేదని ప్రశ్నించారు. సిద్దిపేట ఒక కన్ను, దుబ్బాక ఒక కన్ను అనే మంత్రి దుబ్బాకపై సవతి తల్లి ప్రేమ చూపించడం సరికాదన్నారు. దుబ్బాకకు వచ్చే నిధులను కూడా సిద్దిపేటకు ఎత్తుకెళ్లి సిద్దిపేట నియోజకవర్గాన్ని మాత్రమే అభివృద్ధి చేసుకున్న ఘనత హరీష్‌రావుకే దక్కుతుందన్నారు. తెలంగాణ ఉద్యమంలో పని చేసిన తనను సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ విమర్శించడం తన విజ్ఞతకే వదిలేస్తున్నానన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ వచ్చిన తర్వాత రాష్ట్ర ముఖ్యమంత్రిగా దళిత వ్యక్తిని చేస్తామని చెప్పి మోసం చేసిందన్నారు. కానీ బీజేపి పార్టీ అధికారంలోకి వస్తే రాష్ట్ర ముఖ్యమంత్రిగా బిసి వ్యక్తిని చేస్తామని హామీ ఇచ్చారు. గత పదేళ్ల కాలంలో అభివృద్ధి కాని దుబ్బాక నియోజకవర్గాన్ని ఉప ఎన్నికల్లో తాను గెలిచిన తర్వాత సిసి రోడ్ల నిర్మాణం, మిరుదొడ్డిలో గ్రామ పంచాయతీ, మండల పరిషత్ కార్యాలయం నిర్మాణం, ధర్మారం నుండి వెంకట్రావుపేట, అల్వాల నుండి మెట్టు వరకు రోడ్ల నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం దుబ్బాక నియోజకవర్గంలో ఉన్న భూములను స్వాధీనం చేసుకోవడం కోసం డ్రోన్ కెమెరాలతో భూముల సర్వే చేయించి భూములను గుంజుకునే ప్రయత్నం చేస్తుందని మండిపడ్డారు. దుబ్బాకకు రింగురోడ్డు కావాలని తాను గెలిచినప్పటి నుండి వినతిపత్రాలు అందించినప్పటికీ ఇప్పటికీ రింగురోడ్డు సాంక్షన్ చేయని దద్దమ్మ ప్రభుత్వం బిఆర్ఎస్ అన్నారు. పదేళ్లలో కూపన్ కార్డులు ఇవ్వకుండా క్వాటర్ దుకాణాలను పెంచిన ప్రభుత్వం బిఆర్ఎస్ ప్రభుత్వమే అన్నారు. ఎంపిగా కొనసాగుతున్న కొత్త ప్రభాకర్‌రెడ్డి దుబ్బాక



నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి సారించకుండా సిద్దిపేటలో పబ్బు కావాలనడం సిగ్గుచేటన్నారు. దుబ్బాక నియోజకవర్గ గొల్ల కుర్మలు గొర్రె పిల్లల కోసం కోట్ల రూపాయలు డిడిలు కడితే ఇప్పటికీ గొర్రె పిల్లలు ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. దుబ్బాక నియోజకవర్గ ప్రజలకు బిఆర్ఎస్ ప్రభుత్వం ఒరగబెట్టింది ఏమీ లేదన్నారు. సీఎం కేసీఆర్ చింతమడకలో దళితుల కుటుంబానికి రూ.10 లక్షలు ఇచ్చినప్ప టికీ మిరుదొడ్డి గ్రామంలో ఎందుకివ్వలేదని ప్రశ్నించారు. మిరుదొడ్డిలో బిసిబంధుకు 200 మంది దరఖాస్తు చేసుకుంటే కేవలం ముగ్గురికి మాత్రమే బిసిబంధు ఇచ్చి చేతులు దులుపుకోవడం సరికాదన్నారు. సీఎం కేసీఆర్ తాటాకు చప్పుళ్లకు, బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదన్నారు. దుబ్బాక నియోజకవర్గంలో సీఎం కేసీఆర్, మంత్రులు హరీష్, కేటీఆర్ ఎంతమంది వచ్చినప్పటికీ విజయం తనదే అని ధీమా వ్యక్తం చేశారు. బిఆర్ఎస్‌ను దుబ్బాక నుండే భూస్థాపితం చేసేందుకే మొదలుపెడుతామని బిఆర్ఎస్ పార్టీకి హెచ్చరికలు జారీ చేశారు. మంత్రి కేటీఆర్ నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని హితవు పలికారు. పార్టీలకు అతీతంగా నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజలకు ఎక్కడ సమస్య ఉంటే అక్కడ తాను అండగా ఉండడం జరుగుతుందన్నారు. మిరుదొడ్డి గడ్డ కాషాయపు గడ్డ అని కొనియాడారు. రూ.1600 కోట్ల కేంద్ర ప్రభుత్వ నిధులతో మెదక్ నుండి ఎల్కతుర్తి వరకు జాతీయ రహదారి నిర్మించడం జరుగుతుందన్నారు. బిఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత వైన్ షాపులకు టెండర్లు తప్పితే నిరుద్యోగులకు ఉద్యోగాల నోటిఫికేషన్‌లు వేసిన దాఖలాలు లేవన్నారు. బిఆర్ఎస్ హయాంలో పేపర్ లీకేజీలు చేసి కోర్టులో కేసులు వేసి నిరుద్యోగులను అయోమయానికి గురి చేస్తున్నారని మండిపడ్డారు. సీఎం కేసీఆర్‌కు వైన్స్ టెండర్ల మీద ఉన్న శ్రద్ధ నిరుద్యోగులపై లేదన్నారు. ఇప్పటికైనా దుబ్బాక నియోజకవర్గ ప్రజలు ఆలోచించి నవంబర్ 30న జరిగే ఎన్నికల్లో కమలం గుర్తుకు ఓటేసి తనను గెలిపించాలని కోరారు. తనను ఆశీర్వదించి ప్రజలు గెలిపించినట్లయితే దుబ్బాక నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధిపరుస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు దేవరాజు, బీజేపి నాయకులు మొగుల్ల మల్లేశం, కానుగంటి శ్రీనివాస్, లింగాల సదానందరెడ్డి, తోట భూపాల్‌రెడ్డి, తోకల శ్రీనివాస్‌రెడ్డి, మొగుల్ల స్వామి, కృష్ణ, కనకయ్యతోపాటు బీజేపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



---

### ఎంసిఎంసి అనుమతి లేకుండా

## ప్రచార ప్రకటనలు ఇవ్వరాదు

**-48 గంటల సైలెన్స్ పీరియడ్ నిబంధనలు ఉల్లంఘించరాదు**

**-జిల్లా ఎన్నికల అధికారి శరత్**



సంగారెడ్డి, నవంబర్ 27, మనం న్యూస్ః ఎన్నికల సంఘం నిబంధనల మేరకు మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ అనుమతి లేకుండా పోలింగ్ రోజున, పోలింగ్‌కు ఒక రోజు ముందు అయిన 29, 30 తేదీలలో ప్రింట్ మీడియాలో ఎలాంటి ఎన్నికల ప్రచార ప్రకటనలను ప్రచురించకూడదని జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ శరత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ రాజకీయ పక్షాలు, అభ్యర్థులు ఎవరైనా ముందస్తుగా ఎంసిఎంసి ద్వారా అనుమతి కోసం దరఖాస్తు చేసుకొని ధృవీకరణ పొందాలని సూచించారు. ఈనెల 29, 30 తేదీలలో ప్రింట్ మీడియాలో ఎన్నికల ప్రచార ప్రకటనలు ప్రచురితం చేయాలనుకునే వారు తప్పనిసరిగా ఎంసిఎంసి ద్వారా ముందస్తు అనుమతి తీసుకోవాలన్నారు. విద్వేషపూరిత ప్రకటనలను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి ఇవ్వబడదని స్పష్టం చేశారు. ఈనెల 28వ తేదీ సాయంత్రం 5 గంటల నుండి 30వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ఎలాంటి బల్క్ ఎస్ఎంఎస్‌లు ప్రచారం చేయరాదని ఆయన స్పష్టం చేశారు.

# ఓటు హక్కును ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలి

### టిపియుఎస్ జిల్లా అధ్యక్షులు ఊడెం రఘువర్ధన్‌రెడ్డి

సిద్దిపేట అర్బన్, నవంబర్ 27, మనం న్యూస్ః ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధమని, ప్రతి ఒక్కరు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు ఊడెం రఘువర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని శిశుమందిర్‌లో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐదు సంవత్సరాల భవిష్యత్తును నిర్ణయించేది ఓటే అన్నారు. దేశ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఓటును సద్వినియోగం చేసుకోవాలన్నారు. వందశాతం ఓటింగ్ జరిగేలా తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో జన జాగరణ పేరుతో ఓటర్లను చైతన్యవంతం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పబ్బతి శ్రీనాకర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మురళి, ఉపాధ్యక్షులు గడీల శ్రీకాంత్, జిల్లా కోశాధికారి సురేందర్‌రెడ్డి, ఆయా మండలాల అధ్యక్ష కార్యదర్శులు వెంకట్రామిరెడ్డి, జైపాల్, బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# రిస్క్ వద్దు



## -కేసీఆర్‌ను గెలిపిద్దాం... అభివృద్ధి చేసుకుందాం

## -కేసీఆర్‌కు మద్ధతగా బిఆర్ఎస్ శ్రేణుల విస్తృత ప్రచారం

గజ్వేల్/జగదేవ్‌పూర్, నవంబర్ 27, మనం న్యూస్ః తెలంగాణ ఏర్పడక ముందు ఉన్న పరిస్థితుల నుండి తెలంగాణ ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ నేతృత్వంలోని బిఆర్ఎస్ హయాంలో అన్ని రంగాల్లో నేడు తెలంగాణ అన్నింటా అభివృద్ధి చెంది దేశానికే రోల్ మోడల్‌గా నిలిచిందని బిఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. రెండుమార్లు గజ్వేల్ ఎమ్మెల్యేగా గెలిచిన కేసీఆర్‌ను ఈ ఎన్నికల్లో మరోసారి గెలిపించి మూడవసారి హ్యాట్రిక్ సీఎంగా నిలుపుకుందామని, ప్రజలు బీజేపి, కాంగ్రెస్‌లను ఆదరించి రిస్క్ కొనితెచ్చుకోవద్దని వారు కోరారు. సోమవారం రోజున గజ్వేల్ బిఆర్ఎస్ అభ్యర్థి, సీఎం కేసీఆర్‌కు మద్ధతుగా ఎంపిపి బాలేశం గౌడ్, ఎంపిటిసి కవిత శ్రీనివాస్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు పనుగట్ల శ్రీనివాస్ గౌడ్, నాచారం ఆలయ డైరెక్టర్ బుద్ధ నాగరాజు, కొండపోచమ్మ ఆలయ డైరెక్టర్ కుమ్మరి కనకయ్యతోపాటు పలువురు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపి పార్టీలు కక్ష్యపూరితంగా సీఎం కేసీఆర్‌పై కుట్ర చేసి కారు గుర్తుకు ఓటు వేయద్దని ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం





చేస్తున్నాయన్నారు. బిఆర్ఎస్ హయాంలో గజ్వేల్‌తోపాటు తెలంగాణ రాష్ట్రమంతా ఎంతగానో అభివృద్ధి చెందిందని, ప్రజలు బిజేపి, కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. ఈ సందర్భంగా వారు బిఆర్ఎస్ చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరిస్తూ ఈసారి ఈవియం మిషన్‌లో కారు గుర్తుకు ఓటేసే పద్ధతిని వృద్ధులకు, నూతనంగా ఓటు హక్కు పొందిన వారికి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యులు ఎక్బాల్, కొంపల్లి మహేష్, వెంకటేశం, కరుణాకర్, బుద్ధచిన్నసత్యం, మచ్చ బాబు, బచ్చలి భాస్కర్, ఖాజా అజీమ్, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

### -ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో చేరికలు

ఎఫ్‌డిసి ఛైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి సమక్షంలో గజ్వేల్ ఆర్ అండ్ ఆర్ కాలనీకి చెందిన హమాలీ సంఘం, ముదిరాజ్ సంఘం నాయకులు పెద్ద ఎత్తున బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపి, కాంగ్రెస్ నాయకులు వారి ఉనికి కోసమే ప్రచారం చేస్తున్నారన్నారు. ప్రతిపక్ష పార్టీలకు గజ్వేల్‌లో ఈసారి డిపాజిట్‌లు గల్లం తవ్వడం ఖాయమని, లక్ష పై చిలుకు మెజార్టీతో కేసీఆర్‌ను గెలిపిం చుకుంటామన్నారు. మరోసారి కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు.

### -రైతు బాంధవుడు కేసీఆర్

రైతుల కష్టం తెలిసిన వ్యక్తిగా సీఎం కేసీఆర్ రైతుల సంక్షేమానికి, రైతులకు







పంట పెట్టుబడి కోసం ఎంతగానో కృషి చేస్తున్నారని, ఆయన రైతుబాంధవుడని రైతు సమతి మండల ప్రధాన కార్యదర్శి ఆలేటి లోలాకర్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర రైతాంగానికి కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ప్రతి ఎకరాకు నీరందించడంతో పాటు రైతుబంధు పేరుతో పంట పెట్టుబడికి డబ్బులు సైతం అందిస్తున్నారన్నారు. అదేవిధంగా పండించిన పంటను రైతుకు మద్ధతు కల్పిస్తూ స్వయంగా ప్రభుత్వమే కొనుగోలు చేస్తూ రైతుకు మేలు చేకూరుస్తుందన్నారు. రైతులకు కేసీఆర్ చేస్తున్న మేలును ప్రతిపక్షాలు గుర్తించలేక ఆయనపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయని ఆరోపించారు. ప్రజలు తెలివిగా ఆలోచించి ఈసారి ముచ్చటగా మూడవసారి కేసీఆర్‌ను గజ్వేల్ ఎమ్మెల్యేగా గెలిపించి హ్యాట్రిక్ సీఎంగా నిలబెట్టాలని కోరారు.

# సిద్ధప్ప వరకవి... శిరసానమామి

## ఘనంగా సిద్ధప్ప వరకవి గురుపూజోత్సవం

కోహెడ, నవంబర్ 27, మనం న్యూస్ః కోహెడ మండల పరిధిలోని గుండా రెడ్డిపల్లిలో తెలంగాణ వేమనగా ప్రసిద్ధిగాంచిన సిద్ధప్ప వరకవి ఆశ్రమంలో ఆయన కుమారులు అనంతవరం వీరేశలింగం, మాణిక్యలింగం గురుపూజోత్సవం ఘనంగా నిర్వహించారు. సోమవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా సిద్ధప్ప చిత్రపటంతో భక్తులు, అభిమానులు ఆయన శిష్యులు ఊరేగింపుగా వెళ్తూ ఓం నమశ్శివాయ నామస్మరణతో గ్రామంలోని వీధుల గుండా ఊరేగింపుగా వెళ్లారు. అనంతరం ఆశ్రమంలోని సరస్వతి అమ్మవారి వద్ద వేదమంత్రాలతో గాయత్రీ యజ్ఞం నిర్వహించారు. సిద్ధప్ప సమాధి వద్ద ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన శిష్యులు, కుటుంబ సభ్యులు సిద్ధప్పను స్మరించుకున్నారు. సిద్ధప్ప రాసిన గ్రంథంలోని పద్యాలు పాడుతూ భక్తులు భజనలు చేశారు. ఉమ్మడి మెదక్ జిల్లా, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాతోపాటు పలు జిల్లాల నుండి భక్తులు కార్యక్రమానికి హాజరయ్యారు. అనంతరం ఆశ్రమంలో గ్రామస్తులతోపాటు ఆయా గ్రామాల నుండి వచ్చిన శిష్యులందరికీ అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు కొక్కుల సురేష్, పాము శ్రీకాంత్, పోలవేని కుమార స్వామి తదితరులు పాల్గొన్నారు.

### -ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు

సిద్ధప్ప వరకవి ఆశ్రమ అభివృద్ధికి సహకరించిన హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీష్‌కుమార్‌కు ఆయన శిష్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. అదేవిధంగా రానున్న రోజుల్లో మరిన్ని నిధులు కేటాయించి ఆశ్రమం అభివృద్ధికి మరింతగా సహకరించాలని కోరారు.









# కాంగ్రెస్‌తోనే తెలంగాణ అభివృద్ధి

## కాంగ్రెస్ సీనియర్ నాయకులు వంటేరు నరేందర్‌రెడ్డి

జగదేవ్‌పూర్, నవంబర్ 27, మనం న్యూస్ః తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వంటేరు నరేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని బిజి వెంకటాపూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ పథకాలను వివరిస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ అభ్యర్థి తూముకుంట నర్సారెడ్డిని ప్రజలు హస్తం గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని వారు కోరారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రూ. 500లకే గ్యాస్ సిలిండర్‌తోపాటు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం కల్పిస్తుందన్నారు. అదేవిధంగా పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తామన్నారు. రాష్ట్రంలో ఈసారి కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షులు నీల సురేష్, బిజి వెంకటాపూర్ ఉప సర్పంచ్ శ్రీకాంత్, ఉపాధ్యక్షులు అరిగె భాను, పార్టీ సీనియర్ నాయకులు చెక్కల నరేష్, సుధాకర్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

## ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

### -వన్ టౌన్ సిఐ కృష్ణారెడ్డి



సిద్దిపేట అర్బన్, నవంబర్ 27, మనం న్యూస్ః ఓటు వజ్రాయుధమని, ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ద్వారా ప్రజాప్రతి నిధులను ఎన్నుకోవచ్చని వన్‌టౌన్ సిఐ కృష్ణారెడ్డి అన్నారు. సిద్దిపేట వన్ టౌన్, టూ టౌన్ పోలీస్ స్టేషన్‌ల పరిధిలోని పలు ప్రాంతాల్లో సిపి శ్వేత ఆదేశానుసారం కేంద్ర బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ కృష్ణారెడ్డి మాట్లాడుతూ కోర్టును ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని, ఎవరైనా ప్రలోభాలకు గురి చేసినట్లయితే వెంటనే డయల్ 100కు కాల్ చేయాలని సూచించారు. భారత ఎన్నికల సంఘం నూతనంగా ప్రవేశపెట్టిన సీ విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు కూడా చేయవచ్చన్నారు.



# బీజేపితోనే సమగ్రాభివృద్ధి

### -బీజేపిలోకి కొనసాగుతున్న వలసలు
### -కండువా కప్పి పార్టీలోకి
### ఆహ్వానించిన ఎమ్మెల్యే రఘునందన్‌రావు

దుబ్బాక/చేగుంట, నవంబర్ 27, మనం న్యూస్ః బీజేపి పార్టీతోనే దుబ్బాక నియోజకవర్గంలో అభివృద్ధి సాధ్యమవుతుందని పలువురు పేర్కొన్నారు. సోమవారం రోజున చేగుంట మండల పరిధిలోని పెద్ద శివునూరు గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ సీనియర్ నాకులు అప్పల శేఖర్‌తోపాటు 45 మంది కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి బీజేపి పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. బీజేపి సీనియర్ నాయకులు తాడెం వెంగళరావు ఆధ్వర్యంలో దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు సమక్షంలో సోమవారం బీజేపిలో చేరగా ఆయన వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెద్దశివునూరులో పెద్ద ఎత్తున బీజేపి పార్టీకి ఓట్లు పడనున్నాయని వారు తెలిపారు. ఈ ఎన్నికల్లో రఘునందన్‌రావును భారీ మెజార్టీతో గెలిపించి ఐదేళ్ల పాటు శాసనసభకు పంపుతామన్నారు. దుబ్బాక నియోజకవర్గం రఘునందన్ రావు సారథ్యంలో ఎంతగానో అభివృద్ధి చెందుతుందని, ఈ అభివృద్ధిని ఇలాగే కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపి రాష్ట్ర నాయకులు తీగల భూమలింగం గౌడ్, ఉప సర్పంచ్‌లు పాక స్వామి, నాగేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు నగేష్, అంజా గౌడ్, బీజేపి నాయకులు బాలసాయి, హరిప్రసాద్, నర్సింలు తదితరులు ఉన్నారు.





#### -ఇంటింటా అపూర్వ స్పందన

దుబ్బాక బీజేపి అభ్యర్థి రఘునందన్‌రావుకు మద్దతుగా బిజేపి శ్రేణులు పట్టణంలోని 15, 19 వార్డుల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించగా ప్రజల నుండి అపూర్వ స్పందన లభించింది. ఈసారి కూడా దుబ్బాక పట్టణం నుండి భారీ ఎత్తున ఓట్లు కమలం పువ్వు గుర్తుకు వేస్తామని ప్రజలు హామీ ఇస్తున్నారని బిజేపి శ్రేణులు తెలిపాయి. వాడవాడలా ప్రచారం నిర్వహిస్తూ ఈవియం మిషన్‌లో 3వ నెంబర్‌పై ఉన్న కమలం పువ్వు గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను వారు అభ్యర్థించారు.



## జిల్లాలో 144 సెక్షన్ అమలు

సిద్దిపేట రూరల్, నవంబర్ 27, మనం న్యూస్ః జిల్లాలో అసెంబ్లీ ఎన్నికలు ఉన్న నేపథ్యంలో నేడు సాయంత్రం 5 గంటల నుండి 1వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు సిపి శ్వేత సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎన్నికల నియమావళిని తప్పకుండా పాటించాలని తెలిపారు.



### నేడు సిద్దిపేటలో
## హరీష్‌రావు రోడ్ షో

సిద్దిపేట, నవంబర్ 27, మనం న్యూస్ ప్రతినిధిః సిద్దిపేట నియోజకవర్గ బిఆర్ఎస్ అభ్యర్థి హరీష్ రావు ఎన్నికల ప్రచార నేపథ్యంలో నేడు ఉదయం 10 గంటల నుండి రోడ్ షో చేయనున్నారు. వేములవాడ కమాన్ నుండి ప్రారంభించి పాత బస్టాండ్ వరకు భారీ ర్యాలీతో ముగించి బస్టాండ్ వద్ద ప్రచారం చేయనున్నారు.

# బిఆర్ఎస్, కాంగ్రెస్‌ల నుండి బీజేపిలోకి చేరికలు



జగదేవ్‌పూర్, నవంబర్ 27, మనం న్యూస్ః జగదేవ్‌పూర్ మండల పరిధిలోని చాట్లపల్లి గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు సోమవారం బీజేపి పార్టీ యువ నాయకులు దాసరి ఐలయ్య ఆధ్వర్యంలో ఈటల రాజేందర్ కోడలు క్షమిత సమక్షంలో బీజేపిలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేడు ప్రధాని మోదీ స్వయంగా బిఇలు అభివృద్ధి చెందాలనే ఉద్దేశంత తెలంగాణ సీఎంగా బిసిని చేస్తానని హామీ ఇచ్చినందున బీజేపిలో చేరడం జరుగుతుందన్నారు. దేశం అభివృద్ధి చెందాలంటే ప్రధాని మోదీతోనే సాధ్యమన్నారు. పార్టీలో చేరిన వారిలో బండారి మల్లేశం, దాసరి శ్రీశైలం, బరిగె అరుణ్, అనిల్, జహంగీర్, దాసరి కుమార్, నర్సింలు, ప్రవీణ్, బాల్‌రాజు, అనిల్, బాల్‌నర్సయ్య తదితరులు ఉన్నారు.

#### -గాడిపల్లి భాస్కర్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం

గజ్వేల్ బీజేపి అభ్యర్థి ఈటల రాజేందర్‌కు మద్దతుగా గజ్వేల్ మాజీ మున్సిపల్ ఛైర్మన్ గాడిపల్లి భాస్కర్ ఆధ్వర్యంలో విస్తృతంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు గజ్వేల్ ప్రజలంతా ఈసారి ఈటల రాజేందర్‌ను కమలం పువ్వు గుర్తుకు ఓటేసి ఆశీర్వదించాలని కోరారు. అవినీతి అరాచక పాలన సాగిస్తున్న కేసీఆర్‌ను గద్దె దించాలని ప్రజలకు సూచించారు. డబుల్ బెడ్‌రూమ్, రుణమాఫీ. 57 ఏళ్లకే పెన్షన్, మహిళలకు వడ్డీలేని రునాలు, నిరుద్యోగ భృతి ఇంటి వాటిని కేసీఆర్ అమలు చేయలేదన్నారు. బీజేపి అధికారంలోకి వస్తే రైతుకు లాభసాటి వ్యవసాయ పద్ధతులను అందుబాటులోకి తీసుకువస్తామని, ప్రజాసంక్షేమాన్ని కాంక్షించే బీజేపికి ప్రజలు ఓటు వేసి ఈటల రాజేందర్‌ను గెలిపించాలని కోరారు.



